సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 9 । జనవరి । 2025



మావుళ్లమ్మ హుండీ లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ దేవస్థానం ఆదాయం 36 రోజులకు రూ.22,06,667 లభించింది. బుధవారం ఆలయ హుండీలను లెక్కించారు.



ధనుర్మాస పూజలు

పాలకొల్లు సెంట్రల్: శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో బుధవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.



హుండీ ఆదాయం రూ.8 లక్షలు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 48 రోజులకు రూ.8,81,748 ఆదాయం లభించింది.

న్యూస్‌రీల్

దేహదారుఢ్య పరీక్షలకు 459 మంది హాజరు



అభ్యర్థులకు పరుగుపందెం

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతుంది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో బుధవారం దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. ఎంపిక పోటీలకు 459 మంది హాజరుకాగా.. వారిలో 313 మంది ఎంపికైనట్లు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. అభ్యర్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యే సమయంలో తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని ఆయన తెలిపారు.

నిరంతర అధ్యయనంతోనే సివిల్స్‌లో విజయం



ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: సామాజిక ఆర్థిక పరిస్థితులపై నిరంతరం అధ్యయనం, అవగాహనతోనే సివిల్స్‌లో విజయం సాధించగలరని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా బుధవారం సివిల్ సర్వీసెస్ ప్రిపరేషన్ స్ట్రాటజీ అండ్ ప్రిపరేషన్ గైడ్ అంశంపై రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యసాధనలో సబ్జెక్టుతో పాటు సామాజిక, ఆర్థిక అంశాలు దేశ సాంకేతిక ప్రగతి, మారుతున్న టెక్నాలజీలు, వాతావరణ పరిస్థితులు, జీవన విధానం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నిత్యం దినపత్రికల్లో వస్తున్న అంశాలను అధ్యయనం చేయాలన్నారు. కేవలం సివిల్స్ ప్రిపరేషన్‌కు మాత్రమే గాకుండా ఏ పోటీ పరీక్షకు హాజరు కావాలన్నా నిరంతరం నూతన అంశాలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం రాహుల్‌కుమార్‌రెడ్డిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ సత్కరించారు.

రోడ్ల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి



జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారుల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ వైస్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి సంఘం సమావేశం జరిగింది. ఆర్అండ్‌బీ రహదారుల పురోగతి, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం కింద అమలు చేస్తున్న మంచినీటి పథకాల ఏర్పాటు, ఇరిగేషన్‌కు సంబంధించి కాల్వలకు నీటి విడుదల వంటి అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసరావు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

4,560 అర్జీల స్వీకరణ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో 27 రోజుల పాటు 318 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా 4,560 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. 1,229 అర్జీలు పరిష్కరించగా, 3,331 పరిష్కరించాల్సి ఉందన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం 45 రోజులు గడువు విధించిందని, నిర్ణీత సమయంలోగా నూరు శాతం అర్జీలను పరిష్కరిస్తారన్నారు. పరిష్కారం కాని అర్జీలు ఎందుకు కాలేదో సంబంధిత వ్యక్తులకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తారన్నారు.

సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన విస్తృత ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విద్యుత్, నెడ్‌క్యాప్ అధికారులతో సమావేశమై జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన అమలుపై సమీక్షించారు. సూర్య ఘర్ యోజన పథకం అమలు మందకొడిగా సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంతవరకు కేవలం 750 రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడంపై ప్రశ్నించారు. సుమారు 50 వేల కనెక్షన్లు లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు.

● మరమ్మతులు.. సర్కారు కుప్పిగంతులు

మూన్నాళ్ల ముచ్చటే!



పెనుగొండ-మార్టేరు రోడ్డులో పెనుగొండ వద్ద అసంపూర్తిగా మరమ్మతులు

- జిల్లాలో గుంతలు పూడ్చేందుకు రూ.42.57 కోట్లు మంజూరు
- ఇంతవరకు రూ.18 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి
- సంక్రాంతికి వచ్చే వారికి రోడ్లు బాగుచేశామని చెప్పుకునే ప్రయత్నం
- పండుగ మూడు రోజులు మన్నితే చాలన్నట్లు పనులు
- వారం పదిరోజులకే పైకిలేస్తున్న రాళ్లు, బూడిద

సాక్షి, భీమవరం: రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పి చేతులెత్తేసిన కూటమి సర్కారు కనీస మరమ్మతుల్లోనూ కుప్పిగంతులు వేస్తోంది. ప్యాచ్ వర్కులు, అత్యవసర మరమత్తుల నిమిత్తం జిల్లాకు రూ. 42.57 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవే(ఎస్‌హెచ్) రోడ్లలో రూ.10.45 కోట్ల విలువైన 41 పనులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల(ఎండీఆర్)లో రూ.32.12 కోట్లు విలువైన 140 పనులు ఉన్నాయి. వీటిలో తణుకు-భీమవరం, చేబ్రోలు-ఉండి, కాళీపట్నం-భీమవరం, భీమవరం-గుడివాడ తదితర 50కు పైగా రోడ్లలో 698 కిలోమీటర్లు మేర మరమ్మతులు చేయాల్సి ఉంది.

నాసిరకంగా పనులు

సంక్రాంతి నాటికి రోడ్లపై ఎక్కడా గుంతలన్నవే లేకుండా చేస్తామని ప్రకటించగా ఇంతవరకు రూ.18 కోట్ల విలువైన 40 శాతం మేర పూర్తయ్యాయి. నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా చాలాచోట్ల నాసిరకంగా చేస్తుండటంతో గుంతలు పూడ్చిన కొద్దిరోజులకే రాళ్లు పైకిలేచిపోయి ప్రమాదభరితంగా తయారవుతున్నాయి. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. జిల్లాలో జరిగే సంక్రాంతి సంబరాలకు దేశ, విదేశాల నుంచి బంధుమిత్రులు తరలివస్తుంటారు. వారి దృష్టిని ఆకర్షించేందుకు మూడు రోజుల పాటు మన్నితే చాలన్నట్టుగా రోడ్ల మరమ్మతులు సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	మొత్తం పనులు	కిలోమీటర్లు	మంజూరు మొత్తం (రూ.కోట్లలో)	నియోజకవర్గం	మొత్తం పనులు	కిలోమీటర్లు	మంజూరు మొత్తం (రూ.కోట్లలో)
భీమవరం	29	77.42	8.61	తాడేపల్లిగూడెం	29	142	6.9
ఉండి	39	151.88	12.25	నరసాపురం	15	55	2.97
పాలకొల్లు	18	73.59	3.64	తణుకు	14	56.8	2.35
ఆచంట	25	97.38	3.33	ఉంగుటూరు	12	43.9	2.52



తాడేపల్లిగూడెం పోలీస్ ఐల్యాండ్ నుంచి ప్రత్తిపాడు హైవే బైపాస్ వరకు ఆరు కిలోమీటర్ల మేర రూ.40 లక్షల వ్యయంతో గుంతలు పూడ్చే పనులు నాసిరకంగా చేశారు. గోతుల్లో బూడిద, ఎర్ర కంకర వేసి పైన బేబీ చిప్స్‌తో తారుపూశారు. రెండు నెలల క్రితం ఈ పనులు నిర్వహించగా అప్పుడే రాళ్లపైకి లేచిపోయి గోతులు యథాస్థితికి చేరాయి.



వీరవాసరం మండలం నౌదూరు జంక్షన్ నుంచి కొణితివాడ మీదుగా మడుగుపోలవరం వెళ్లే సుమారు ఐదు కిలోమీటర్లు రూ.20 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. నౌదూరు నుంచి కొణితివాడ వరకు గోతులను పూడ్చి తారు వేశారు. కొణితివాడ నుంచి మడుగుపోలవరం వరకు కంకర వేసినా నిధులు చాలక తారు వేయకుండా వదిలివేయడంతో రాళ్లు పైకిలేచిపోయి ప్రమాదభరితంగా తయారయ్యాయి.



కాళ్ల మండలం కాళ్లకూరులో సీసీ రోడ్డున అనుకునే స్టేట్ హైవేకి చేసిన మరమ్మతులు అధ్వానంగా ఉన్నాయి. పనుల్లో నాసిరకం మెటీరియల్ వినియోగించడం, తూతూమంత్రంగా పనులు చేయడంతో వారం రోజులకే గుంతలు బయటపడుతున్నాయి. రాళ్లుపైకి లేచిపోయి రోడ్డంతా పరుచుకుని ప్రమాదభరితంగా తయారయ్యాయి.



పోడూరు మండలం కొమ్ముచిక్కాల నుంచి కవిటం వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు మేర చేపట్టిన రోడ్డు మరమ్మతుల్లో నాణ్యత లోపించింది. గోతులను పూడ్చే సమయంలో వాటిలో దుమ్ము, వ్యర్థాలు లేకుండా బ్రష్‌లు లేదా ఎయిర్ గన్స్‌తో శుభ్రం చేస్తుంటారు. ఈ రోడ్డులో అదేమీ లేకుండా గోతుల్లో తారు మిక్స్ చేసిన చిప్స్‌తో నింపుతూ పని కానిచ్చేశారు.



నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా జొన్నలగరువు వరకు 16 కిలోమీటర్ల మేర రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. గోతుల్లో గ్రావెల్, కంకర వేసి అసంపూర్తిగా వదిలివేశారు. వాహనాల తాకిడికి రాళ్లు, బూడిదలు పైకిలేచిపోయి రోడ్డంతో కమ్మేస్తున్నాయి. ముందు ఏదైనా వాహనం వెళుతుంటే బూడిద లేచిపోతుండటంతో వెనుక వస్తున్న వారికి దారి కనిపించడం లేదు.

కార్పొరేషన్ల ద్వారా విరివిగా రుణాలు

భీమవరం(ప్రకాశంచౌక్): ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా జిల్లాకు రుణాలు మంజూరయ్యాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా వివిధ వర్గాలకు మంజూరు చేసే రుణాలపై అధికారులు, బ్యాంకర్లుతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు 714 యూనిట్లకు రూ.22.38 కోట్ల సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. సెర్ప్ ద్వారా 120 ఆటోలను మంజూరు చేస్తామన్నారు. బీసీ వర్గాల స్వయం ఉపాధి పథకాలకు 1,901 మందికి రూ.36.49 కోట్లు, ఇతర వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద 215 మందికి రూ.3.73 కోట్లు మంజూర చేస్తామన్నారు. కాపు కార్పొరేషన్ ఎంఎస్ఎంఈ పథకంలో 694 యూనిట్లను నెలకొల్పేందుకు రూ.13.88 కోట్లు రుణాలు మంజూరు చేస్తామన్నారు. జనవరి 26, 27 తేదీల్లో దరఖాస్తులు తిరస్కరణలు ఉంటే తెలియజేస్తారని, లక్ష్యానికి అనుగుణంగా అవకాశం ఉంటే కొత్తవారిని చేర్చుతారన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.విజయ ప్రకాష్, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఏ.నాగేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ వేణు గోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

జల సంరక్షణ ప్రాజెక్ట్‌పై సమీక్ష : జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన జల సంరక్షణ ప్రాజెక్ట్ పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని కలెక్టర్‌ను జల శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. సెంట్రల్ టీం జిల్లాలో మూడు రోజుల పర్యటన అనంతరం బుధవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ జనవరి 6 నుంచి 8 వరకు ఆకివీడు మండలం చిన్న కాపవరం, పెద్ద కాపవరం, పెనుమంట్ర మండలం పొలమూరు, ఆచంట మండలం భీమలాపురం, నరసాపురం మండలం నరసాపురం, మొగల్తూరు మండలం మొగల్తూరులో పర్యటించి జల శక్తి అభియాన్ పథకంలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించామన్నారు.

'తల్లికి వందనం' అమలు చేయాలి



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. సమాఖ్య ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తల్లికి వందనం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఈ విద్యా సంవత్సరానికి అమలు చేయలేనని చెప్పడం సరైన విధానం కాదన్నారు. వెంటనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు.

వైకుంఠ ద్వార వైభవం

- ద్వారకాతిరుమలలో సర్వం సిద్ధం
- నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి గిరి ప్రదక్షిణ
- రేపు ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం
- నిజరూపంలో దర్శనమివ్వనున్న స్వామివారు



దర్శనం క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శన స్వాగత ద్వారం

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణ, అలాగే ఉత్తర ద్వార దర్శనానికి ద్వారకాతిరుమల దివ్య క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ రాజగోపురాలు, పరిసరాలు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అదనపు సిబ్బందితో క్షేత్ర పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు జరిపించారు. భక్తులు, గోవింద స్వాముల పాదాల రక్షణ కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో గడ్డిని పరిచారు. దారిపొడవునా విద్యుత్ లైట్లు, సేదతీరేందుకు షామియానా పందిళ్లను నిర్మించారు. ఈ వేడుకలో స్వామివారు కొలువుదీరనున్న ధర్మప్రచార రథాన్ని పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఇదిలా ఉంటే శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక స్వామి వారి పాదుకా మండపం వద్ద గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది.

గిరి ప్రదక్షిణ జరిగేదిలా..

ముందుగా ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాధరావు తదితరులు పాదుకా మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి, జెండా ఊపి గిరి ప్రదక్షిణ వేడుక ప్రారంభిస్తారు. ఈ యాత్ర మల్లేశ్వరం (దొరసానిపాడు రోడ్డు) మీదుగా గిరి చుట్టూ తిరిగి కొండపైన ఆశ్రమం వద్దకు చేరుతుంది. అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా ఆలయానికి చేరుకుంటుంది. 5 కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు మధ్యలో మంచినీరు, పండ్లు, అల్పాహారాలు, టీలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆంబులెన్స్, నడవలేని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఉచిత బస్సును ఏర్పాటు చేస్తోంది.

అత్యవసర ఎగ్జిట్ గేట్లు : క్యూలైన్లలో ప్రతీ 30 అడుగులకు ఒక అత్యవసర ఎగ్జిట్ గేటును ఏర్పాటు చేశారు. అడుగడుగునా మంచినీటి సౌకర్యం, అల్పాహారం, స్నాక్స్ అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రథమ చికిత్సా కేంద్రాన్ని అనివేటి మండపం వద్ద ఏర్పాటు చేశారు.

ఉత్తర ద్వార దర్శనం ఇలా..

- ఉచిత దర్శనం చేసుకునేవారు, రూ.100, రూ.200, రూ.500 టికెట్ల ద్వారా వెళ్లే భక్తులు ఆలయ తూర్పు ప్రాంతంలోని సప్తగోకులం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా, ఉత్తర రాజగోపురం లోంచి ఆలయంలోకి ప్రవేశిస్తారు.
- నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్న భక్తులు పడమర రాజగోపురం పక్కనున్న ప్రత్యేక క్యూలైన్ ద్వారా, ఉత్తర రాజగోపురం లోంచి ఆలయంలోకి వెళ్తారు.
- వీఐపీలు, వీవీఐపీలు, గోవింద స్వాములు, స్థానిక భక్తులు నూతనంగా నిర్మించిన క్యూకాంప్లెక్స్, అనివేటి మండపం మధ్యలోంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా, దక్షిణ రాజగోపురంలోంచి ఆలయంలోకి వెళ్తారు.
- దర్శనానంతరం భక్తులు ఆలయం లోంచి తూర్పు రాజగోపురం మీదుగా బయటకు వెళ్తారు. పడమర రాజగోపురంలోంచి అర్చకులు, పండితులకు మాత్రమే ప్రవేశం.



ముస్తాబైన ఉత్తర ద్వారాలు



శ్రీవారి ధర్మప్రచార రథం

వైభవంగా నిర్వహిస్తాం

శ్రీవారి వైభవాన్ని చాటేలా గిరి ప్రదక్షిణ, శుక్రవారం ఉత్తర ద్వార దర్శనాన్ని నిర్వహిస్తాం. గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు, గోవింద స్వాములు పాల్గొనున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం.

– వేండ్ర త్రినాథరావు, దేవస్థానం ఈఓ

క్లుప్తంగా

సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు కళ్యాణి

దెందులూరు: పుదుచ్చేరిలో ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఏలూరు జిల్లా దెందులూరు ఉన్నత పాఠశాల బోటని ఉపాధ్యాయురాలు బీఎస్ఎన్‌కే కళ్యాణి ఎంపికయ్యారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఉపాధ్యాయుల విభాగంలో ఉపాధ్యాయురాలు కళ్యాణి వైద్య, వ్యవసాయ, ఆహార పరిశోధన రంగాలకు దోహదపడే విధంగా ఎక్స్‌ట్రాక్షన్ ఆఫ్ డీఎన్ఏ ప్రాజెక్టును ప్రదర్శించారు. దీంతో ఆమెను సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఎంపిక చేస్తూ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఉన్నతాధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయురాలు కళ్యాణిని అభినందించారు.

ఏలూరు ఏరువాక కేంద్రానికి బెస్ట్ డాట్ సెంటర్ అవార్డు



బెస్ట్ డాట్ సెంటర్ అవార్డును అందుకుంటున్న ఫణికుమార్

ఏలూరు(మెట్రో): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2023–24 సంవత్సరానికి గాను వ్యవసాయంలో రైతులకు అందించిన సేవలకుగాను ఏలూరు ఏరువాక కేంద్రానికి బెస్ట్ డాట్ సెంటర్ అవార్డు లభించింది. ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన 54వ ఆర్‌ఈఏసీ మీటింగ్‌లో ఈ అవార్డును ప్రకటించారు. ఏఎన్‌జీఆర్‌ఏయూ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మి, ఏపీ వ్యవసాయ కమిషనర్ అండ్ డైరెక్టర్ డా.ఢిల్లీరావు చేతుల మీదుగా ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్ అవార్డు అందుకున్నారు. విశ్వ విద్యాలయ పరిశోధన సంచాలకులు డా. పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డా.జి.శివన్నారాయణ పాల్గొన్నారు.

కలుషిత నీటితో పలువురికి అస్వస్థత



శృంగవృక్షంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పాలకోడేరు: శృంగవృక్షంలో కలుషిత నీరు తాగడం వలన గత నాలుగు రోజులుగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. పంచాయతీ ఫిల్టర్ చేయకుండా మంచి నీటిని సరఫరా చేయడం వలనే అనారోగ్యాలు తలెత్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓ భాను నాయక్‌ను వివరణ కోరగా గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న మాట వాస్తవమే అని అన్నారు. తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి మందులు సరఫరా చేశామన్నారు. మంగళ, బుధవారాల్లో 7 కేసులు గుర్తించామని, వారికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

నిలిచిన సదరం క్యాంపులు

- పింఛన్ల తనిఖీ పేరిట సదరం నిలిపివేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ వరకు సదరం క్యాంపులు లేనట్టేనా?
- కొత్త పింఛన్ల కోసం దివ్యాంగుల ఎదురుచూపులు



భీమవరం ప్రభుత్వాసుపత్రి



ఆకివీడులో పింఛన్లు తనిఖీ చేస్తున్న డాక్టర్లు, అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే ప్రజలకు గత ప్రభుత్వంలో అందించిన అనేక పథకాలు దూరం చేయగా తాజాగా పింఛన్లలో కోత విధించేందుకు సిద్ధమైంది. పింఛన్ల తనిఖీ పేరిట దివ్యాంగులను సైతం ఇబ్బంది పెట్టేందుకు చంద్రబాబు వెనుకాడడం లేదు. పింఛన్ల తనిఖీ పేరిట సదరం క్యాంపులను ఈనెల 1వ తేదీ నుంచి నిలిపివేయడం జరిగింది. దీంతో దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు సదరం సర్టిఫికెట్ అందుకుని పింఛన్ పొందే అవకాశం దూరం కానుంది. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రభుత్వం నుంచి పింఛన్ సాయం పొందాలంటే ముందుగా సదరం ధ్రువీకరణ పత్రం పొందాలి. ఇందుకోసం ప్రభుత్వం సదరం క్యాంపులు నిర్వహిస్తుంటుంది. సదరం సర్టిఫికెట్ ఉంటే నెలకు వారికి రూ.6 వేలు నుంచి రూ.15 వేలు పింఛన్ అందుతుంది. అయితే ప్రస్తుతం పింఛన్ల తనిఖీ పేరిట సదరం క్యాంపులు నిలివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు మళ్లీ సదరం క్యాంపులు ఉండవని తెలుస్తోంది. దీంతో వందలాది మంది దివ్యాంగులకు నూతన పెన్షన్లు అందుకోవడంలో ఆలస్యం ఏర్పడనుంది. కూటమి ప్రభుత్వ తీరుతో కొత్త పింఛన్ల కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న దివ్యాంగులు ఉసూరుమంటున్నారు.

జిల్లాలో పింఛన్ల తనిఖీలు

జిల్లాలో రూ.10 వేలు, రూ.15 వేలు పింఛన్ (డీఎంహెచ్ఓ పెన్షన్స్)ల లబ్ధిదారులను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో 1510 డీఎంహెచ్ఓ పెన్షన్లు ఉన్నాయి. వాటి తనిఖీలకు విజయవాడ నుంచి ఆరుగురు డాక్టర్ల బృందం వచ్చి స్థానిక వైద్యారోగ్యశాఖ, డీఆర్‌డీఏ అధికారులతో కలిసి పెన్షన్లు తనిఖీ చేస్తున్నారు. దాని వల్ల జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం క్యాంపులు నిలిపేశారు. ఈపెన్షన్ల తనిఖీలు పూర్తి చేసిన తర్వాత జిల్లాలోని 25 వేల వరకు ఉన్న దివ్యాంగులు (రూ.6 వేలు) పెన్షన్లు తనిఖీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా సదరం క్యాంపులు వివరాలు

జిల్లా ఆస్పత్రి తణుకులో:
ఆర్థోపెడిక్, కళ్లు, ఈఎన్‌టీ, మానసిక
భీమవరం ఏరియా ఆస్పత్రి:
ఆర్థోపెడిక్ (ఎముకలు)
తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి: ఆర్థోపెడిక్
ఆకివీడు ఏరియా ఆస్పత్రి : ఆర్థోపెడిక్

స్లాట్ బుక్ చేసుకున్నవారి పరిస్థితి ఏంటి

సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు ఈఏడాది మార్చి నెల వరకు సదరం స్లాట్‌ను వార్డు, గ్రామ సచివాలయం ద్వారా బుక్ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం సదరం క్యాంపులు నిలిపివేయడం వల్ల స్లాట్ బుక్ చేసుకున్న వారి పరిస్థితిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఏప్రిల్ వరకు వారికి సమయం ఉంటుందా.. లేక మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాలో తెలియని పరిస్థితి.

నెలకి 400 సర్టిఫికెట్ల జారీ

జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రతి సోమవారం, శుక్రవారం, మంగళవారం నాడు సదరం క్యాంపులు నిర్వహించేవారు. ఆయా క్యాంపులకు ప్రతి వారం 25 నుంచి 30 మందికి పరీక్షలు నిర్వహించేవారు. దాంతో జిల్లా వ్యాప్తంగా నెలకి 400 వరకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు.

పింఛన్లలో కోత

గత ప్రభుత్వంలో అర్హులకు ఏడాదికి రెండుసార్లు నూతన పింఛన్లు అందించడం జరిగేది. ఈ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పూర్తయినా కూడా కొత్త పింఛన్ల ఊసే లేదు. పైగా ఉన్న పింఛన్లు తగ్గించే పనిలో పడింది. పింఛన్ల తనిఖీలో రకరకాల కారణాలను చూపి పింఛన్లు తొలగించాలని ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. మూడు నెలల పాటు సదరం నిలుపుదల చేస్తే కొత్త పింఛన్లు ఈఏడాదికి కూడా ఇవ్వాలసిన పని ఉండదని భావిస్తుంది. సదరం సర్టిఫికెట్లు ఆలస్యంగా కారణం చూపవచ్చని కుట్రలు చేసి సదరం క్యాంపులు నిలిపేసింది.

కానిస్టేబుల్ అభ్యర్థుల పరుగు పోటీలో అపశ్రుతి



అభ్యర్థిని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చేపడుతున్న కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు నిర్వహిస్తున్న 1600 మీటర్ల పరుగు పోటీలో బుధవారం అపశ్రుతి చోటుచేసుకుంది. పరుగు పోటీలో ఓ అభ్యర్థి కాలు ఆకస్మికంగా కిందపడిపోయాడు. వెంటనే స్పందించిన పోలీస్ అధికారులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. పరుగు పోటీల్లో నిర్ణీత సమయానికి లక్ష్యాన్ని చేరుకుంటేనే అర్హత సాధించే అవకాశం ఉండడంతో బ్యాచ్ నెంబర్ 12లో ఏలూరు లంకపేట ప్రాంతానికి చెందిన ఎం.చంద్రశేఖర్ అనే అభ్యర్థి వేగంగా పరుగుపెడుతూ కాలు విరగటంతో కుప్పకూలిపోయాడు. అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో చంద్రశేఖర్‌ను ఏలూరు సర్వజన అసుపత్రికి తరలించారు. పరుగు పోటీలను పర్యవేక్షిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వెంటనే స్పందిస్తూ సర్వజన ఆసుపత్రికి వెళ్లి బాధితుడ్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈనెల 9వ తేదీన కానిస్టేబుల్ దేహదారుడ్య పరీక్షలు ఆఖరి రోజు అని, ఇప్పటి వరకూ హాజరుకాని ఎవరైనా అభ్యర్థులు ఈ పోటీలకు హాజరుకావచ్చని ఎస్పీ కేపీ శివకిషోర్ స్పష్టం చేశారు.

ఎకో జోన్ వద్దంటూ నిరసన



ఆకివీడులో కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న ప్రజలు

ఆకివీడు: ప్రజల కొంప ముంచే కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆకివీడు మండల ప్రజలు, నాయకులు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని నాయకులు, ప్రజలు, రైతులు తీవ్రంగా వ్యతిరేకించి సమావేశం ముందు బైఠాయించారు. ధర్నా చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం, 120 జీవో వల్ల తీవ్రంగా నష్టపోయామని, జిరాయితీ రైతులకు నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. ఎకో జోన్ వల్ల 10 కిలోమీటర్ల దూరం వరకూ ఏ విధమైన ఫ్యాక్టరీల నిర్మాణం, కట్టడాలు జరగవని దీనివల్ల గ్రామాలకు గ్రామాలు వలసలు పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట పొలాలు నష్టపోయామన్నారు. నష్టపరిహారం ఇవ్వాలని, కొల్లేరు కాంటూర్‌ను మూడుకు కుదించాలని, ఎకో జోన్ ప్రస్తావనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్, అభయారణ్య రేంజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఆంజనేయులు, రేంజర్ సెక్షన్ అధికారిణి సుజాత, ఎస్సై హనుమంతు నాగరాజు, నాయకులు మోటుపల్లి ప్రసాద్, జంపన సత్యనారాయణరాజు, సుబ్రహ్మణ్యం రాజు, జేకే, భగవాన్‌రెడ్డి, కనుమూరు రామకృష్ణంరాజు, సర్పంచ్‌లు చిగురుపాటి చిట్టిబాబు, గురువెల్లి అన్నపూర్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఆక్వాకు లైసెన్స్ తప్పనిసరి

- ఆక్వా అనుబంధ పరిశ్రమలకూ లైసెన్సులు పొందాల్సిందే
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాగులో ఉన్న రొయ్యల చెరువు

దెందులూరు: ఆక్వా సాగుదారులతోపాటు ఆక్వా అనుబంధ పరిశ్రమల యజమానులు కూడా లైసెన్సులు తీసుకోవాలనే నిబంధనను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్సడా చట్టం–2020 అనుసరించి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల నిర్వాహకులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

పథకాలకు లైసెన్సే కీలకం

విద్యుత్ కనెక్షన్ల మంజూరు, వినియోగంపై రాయితీ వర్తింపుతో పాటు చేపలు, రొయ్యల క్రయవిక్రయాలకు లైసెన్సును తప్పనిసరి చేయనున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న పథకాలతో పాటు భవిష్యత్‌లో అమలు చేయబోయే పథకాలకూ ఈ లైసెన్సే కీలకం కానుంది. రానున్న రోజుల్లో బీమా సదుపాయం కల్పించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ లైసెన్స్ తప్పనిసరి. చేపలు, రొయ్యలకు సంబంధించి మేతలు, మందుల దుకాణాల యజమానులు, కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులకు చట్టబద్ధత కల్పించేందుకు లైసెన్స్ తప్పనిసరి చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఉమ్మడి జిల్లాల్లో ఆక్వా సాగు వివరాలు

ఆక్వా సాగు విస్తీర్ణం :	2.90 లక్షల ఎకరాలు
చేపల సాగు :	1.80 లక్షల ఎకరాలు
రొయ్యల సాగు :	1.10 లక్షల ఎకరాలు
కొనుగోలు కేంద్రాలు :	120
ప్రాసెసింగ్ యూనిట్లు :	30
దుకాణాలు :	1500

తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలి



పాత లైసెన్సులతో నిమిత్తం లేకుండా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. ఆక్వా జోన్ పరిధిలోని దరఖాస్తులకు 6 రోజులు, నాన్ ఆక్వా జోన్‌లో వాటికి 15 రోజుల్లో మంజూరు చేస్తాం. ఒకే చెరువులో ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే అందరి తరపున ఒకటే పొందే వెసులుబాటు కల్పిస్తున్నాం. – కేఎస్‌వీ నాగలింగాచార్యులు, మత్స్యశాఖ జిల్లా అధికారి

పట్టపగలే భారీ బరులు సిద్ధం



కలిదిండిలో బరుల ఏర్పాట్లులో నిమగ్నమైన కూలీలు



బరులను సిద్ధం చేస్తున్న దృశ్యం

- జూదాలు వద్దని హెచ్చరిస్తున్న పోలీసులు
- పట్టించుకోని కోడి పందాల నిర్వాహకులు

కై కలూరు: జూదాలు వద్దు.. సాంప్రదాయ క్రీడలే ముద్దు.. అంటూ పోలీసులు మొత్తుకుంటున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చూసినా భారీ బ్యానర్లతో ఆయా గ్రామాల్లో ప్రజలకు పోలీసు సిబ్బంది అవగాహన కలిగిస్తున్నారు. కైకలూరులో అయితే పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువత జూదాలకు ఆకర్షితులు కావద్దని క్రికెట్ టోర్నమెంట్ సైతం ఏర్పాటు చేశారు. ఒక వైపు ఇంతలా పోలీసు ప్రచారం జరుగుతున్నా.. మరోవైపు పందాల నిర్వాహకులు పట్టపగలే భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు. కలిదిండి నుంచి భోగేశ్వరలంక వెళ్లే రహదారిలో పంటపొలాల మధ్య భారీగా బరి ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కాకుండా ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో సైతం బరులకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పండగ మూడు రోజులు ముందు బారులు వెలిసేవి. కూటమి ప్రభుత్వంలో నిర్వాహకులు ముందుగానే పందాలకు బరులను సిద్ధం చేసుకుంటున్నారు. కలిదిండిలో ఏర్పాటు చేస్తున్న భారీ బరిపై ఎస్సై వెంకటేశ్వరరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన జాతీయస్థాయి సెమినార్

దెందులూరు: గోపన్నపాలెంలోని శ్రీసీతారామా ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన 'అథ్లెటిక్స్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్' జాతీయస్థాయి సెమినార్ బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్‌గా చీఫ్ కోచ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డాక్టర్ వినాయక ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సూరంపాలెం, డాక్టర్ ఎస్ సరోజి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సీబీఐటీ హైదరాబాద్ నుంచి డాక్టర్ రాజు హాజరయ్యారు. అథ్లెటిక్స్‌లోని మెలకువలపై విద్యార్థులకు వివరించారు. ముగింపు సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేల్ అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా డాక్టర్ రత్నబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెంగాలీ కూలీలే బెటరు!

- వరినాట్లలో బెంగాలీ కూలీలపైనే రైతుల మక్కువ
- ఖర్చు తక్కువ, కూలీల కొరత కారణాలు



వీరవాసరం మండలం పంజావేమవరంలో దాళ్వా వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

భీమవరం: వరినాట్లు వేసేందుకు రైతన్నలు బెంగాలీ కూలీలపైనే మక్కువ చూపుతున్నారు. కూలీల కొరత, వరిసాగు ఖర్చులు తగ్గించుకునేందుకు యంత్రాల వినియోగంతోపాటు బెంగాలీ కూలీలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో నేడు కార్మికులు అనేక రంగాల్లో స్థిరపడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వివిధ వర్గాల ప్రజలకు అనేక పథకాల పేరుతో సులభంగా రుణాలు అందజేయడంతో నేటి యువత ఎక్కువగా భవన నిర్మాణంలో ఐరన్ కట్టుబడి, సెంట్రింగ్, పెయింటింగ్ పనులకు యంత్రాలు, పనిముట్లకు సమకూర్చుకుని వాటిలో స్థిరపడుతున్నారు. దీనితో స్థానికంగా వ్యవసాయ పనులు చేసేందుకు కూలీల కొరత ఏర్పడగా బెంగాలీ కూలీలతో ఖర్చు తగ్గడం వలన గత కొన్నేళ్లుగా రైతన్నలు బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు.

జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వాసాగు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో దాళ్వా వరినాట్లు వేయాల్సి ఉంది. సార్వా సీజన్‌లో దెబ్బతిన్న పంటకు ఇప్పటివరకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోగా పెట్టుబడి సహాయం కింద ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీని కూటమి సర్కారు ఇంకా నెరవేర్చకపోవడంతో రైతులు అయినకాడికి అప్పులు చేసి నాట్లు మొదలుపెట్టారు.

వారి రూటే సెపరేటు

గతంలో జిల్లాలో ఎక్కువగా మహిళలే వరినాట్లు వేశారు. ఎకరం విస్తీర్ణంలో నాట్లు వేయడానికి దాదాపు 10 మంది అవసరమయ్యేది. అయితే బెంగాలీ కూలీల్లో పురుషులు ఎక్కువగా వరినాట్లు వేస్తుంటారు. అంతేకాకుండా బెంగాలీ పద్ధతిలో వరినాట్లు వేయడం వల్ల తక్కువ విత్తనాలు వినియోగిస్తున్నారు. వరుసలు వరుసలుగా నాట్లు వేయడంతో గాలి, వెలుతురుకు ఎక్కువ అవకాశం ఉండి పిలకలు ఎక్కువగా తొడిగి దుబ్బుబాగా చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. వరిచేలో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి సులభతరంగా ఉంటుందంటున్నారు. తక్కువ వయస్సు కలిగిన లేత నారు నాట్లు వేయడం వల్ల త్వరితగతిన మూన తిరగడమే గాక తొందరగా ఎక్కువ పిలకలు తొడుగుతాయని చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో దమ్ము చేయడానికి, నారుతీయడానికి, నాట్లు వేయడానికి కేవలం రూ.4 వేలు మాత్రమే ఖర్చు అవుతుండడంతో రైతులు బెంగాలీ కూలీలపైనే ఆసక్తి చూపిస్తున్నారు.

వాణిజ్య, విద్యా కేంద్రం గూడెం



ఏపి నిట్ ముఖద్వారం



ఉద్యానవర్సిటీ ముఖద్వారం

- జాతీయ విద్యకు కేరాఫ్
- ప్రపంచ విపణికి చిరునామా



తాడేపల్లిగూడెం వ్యూ

తాడేపల్లిగూడెం: బకింగ్ హాం కెనాల్‌లో జలర వాణా ద్వారా సరుకులు రవాణా జరుగుతున్న కాలంలోనే వాణిజ్యానికి గూడెం పెట్టింది పేరు. జిల్లాలో ఇక్కడే వందపడవలతో ఫ్లీట్ పాయింట్ ఉండేది. తమిళనాడు ద్వారా వార్పులలో బుట్టల్లో ఉల్లివ్యాపారం జరిగే రోజుల్లో ఉల్లి వ్యాపారానికి గూడెం అడ్డా. కర్నూలు రైతు బిడ్డ పండించినా ఏ ఉల్లిపాయ అయినా గూడెం రావాల్సిందే. రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీలో రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా గూడెంకు మంచి పేరుంది. వాణిజ్య రాజ్యంగా గణతికెక్కిన గూడెంలో బెల్లం, అపరాలు, రవ్వలు, నూనెలు అన్ని వ్యాపారాలకే గూడెం ప్రఖ్యాతి గాంచింది. జిల్లాలో ప్రముఖ వాణీ కేంద్రం నుంచి ప్రపంచ వాణిజ్య పటంలో ఏ దేశం చూసినా, వ్యాపారంలో గూడెం బ్రాండ్ మ్యాండేటరీ. ప్రపంచ విపణిలో కూడా గూడెం ముద్ర లేకుండా ఉందంటే అతిశయోక్తి కాదు. వాణిజ్య కేంద్రం ముద్ర దాటి వాణి కేంద్రంగా జాతీయంగా నిట్ వంటి విద్యా సంస్థ రాకతో గూడెం ముఖచిత్రమే మారిపోయింది. దక్షిణాది రాష్ట్రంలో తొలిగా, దేశంలో రెండవదిగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఇక్కడ ఏర్పాటుతో ఉద్యాన రైతుల పంట పండింది. అటు వ్యాపారంలో ఇటు విద్యారంగంలో గూడెం బహుముఖంగా విస్తరిస్తూ రాష్ట్రంలో ఒక ప్రముఖ వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇటీవల బ్రాండెడ్ షోరూమ్‌లో ఒక్కొక్కటిగా పట్టణానికి రావడంతో పట్టణ రూపురేఖలే మారిపోయాయి. గుజరాత్ వంటి రాష్ట్రానికి సినీ కంపెనీల స్క్రీన్‌ల రాజ్యం ఇక్కడ త్వరలో బొమ్మ వేయబోతుంది. జీవీమాల్, చెన్నయ్ షాపింగ్ మాల్, వరమహాలక్ష్మి వంటి వస్త్ర వ్యాపార రాజాలు ఇక్కడ రాజ్యమేలుతున్నాయి. వైద్య రంగంలో కొత్త ఆసుపత్రుల రాకతో ఒక్కొక్కటిగా ఇక్కడ వెలుస్తున్నాయి. కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు ఇక్కడ చేరువచేస్తున్నారు. పిల్లల ఆసుపత్రిల నుంచి ఎముకుల ఆసుపత్రులు, ఎమర్జెన్సీ ఆసుపత్రులు ఇక్కడకు వచ్చాయి. ఆహార ప్రియులకు రుచికరమైన ఆహారం అందించడానికి కొత్త కొత్త హోటళ్లు వెలుస్తున్నాయి. వాణిజ్యం, వాణీ కేంద్రంగా ఇది గూడెం బ్రాండ్ అన్నట్టుగా తాడేపల్లి గూడెం ద్విముఖ పాత్రలో వర్ధిల్లుతోంది.

ఆధ్యాత్మికంగా శోభిల్లుతూ..



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానాని ఆధునీకరించడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారు బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకొని వెళ్లతారు. అదే విధంగా పట్టణంలోని నందిబొమ్మ సెంటర్‌లో ఉన్న విఘేశ్వరరామాలయం, పాతూరులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, శ్రీశ్రీ వల్లి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం, వివిధ శివాలయాలు, ఆర్టీసీ బస్సు స్టాండ్ సమీపంలో వెంకటేశ్వరస్వామి ఆలయం, టూ టౌన్‌లోని శ్రీ వాసవి కన్యకపరమేశ్వరీ పంచాయతన క్షేత్రం, శ్రీ దేవిమహంకాళమ్మ ఆలయం, శంకరమఠం, సత్యనారాయణ స్వామి ఆలయం, శ్రీ విశ్వదుర్గేశ్వరీ అమ్మవారి ఆలయాలు ప్రసిద్ధి గాంచాయి. ఈ ఆలయాలు నిత్య దీప, ధూప పూజ కార్యక్రమాలతో విరాజిల్లుతున్నాయి. శుక్రవారం బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి.

విస్తరిస్తున్న వైద్య రంగం

పట్టణంలో వైద్య సేవలు గతంలో అంతంత మాత్రముగానే ఉండేవి. డాక్టర్ కోడే వెంకట్రావు వైద్యునిగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయన తదనంతరం వైద్య సేవలకు తణుకు, రాజమండ్రి, భీమవరం, ఏలూరు, వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల పట్టణంలో వైష్ణవి ఎమర్జెన్సీ ఆసుపత్రి ప్రారంభించడంతో పట్టణం వైద్య కేంద్రంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. త్రినిటీ స్టార్, చైతన్య ఎమెర్జన్సీ ఆసుపత్రులు అందుబాటులోకి రావడంతో అత్యావసర వైద్య సేవలు పొందే అవకాశం పట్టణ పరిసర ప్రాంతాలకు అందుబాటులోకి వచ్చాయి. అదే విధంగా ఏరియా ఆసుపత్రి ఆదునీకరించడంతో పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు పొందుగల్గుతున్నారు. ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేస్తుంది.

అందుబాటులో రైల్వేస్టేషన్

ప్రధాన రైల్వే మార్గం తాడేపల్లిగూడెం పట్టణం నుంచి వెళ్లడంతో ప్రయాణ సౌకర్యాలు తాడేపల్లిగూడెం పట్టణ పరిసర ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయి. గూడెం రైల్వే స్టేషన్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించవచ్చు.

సెయింట్ ఆన్స్‌లో తల్లిదండ్రులతో అవగాహన సదస్సు



సెయింట్ ఆన్స్ విద్యాసంస్థ చైర్మన్ అద్దంకి విజయకుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మకు మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఆధునూతన సదుపాయాలు అందించడంలో సెంట్ ఆన్స్ సంస్థలు ముందుంజలో ఉన్నాయి. గత 33 సంవత్సరల నుంచి రాష్ట్ర, జిల్లా ర్యాంకులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిస్తున్నటువంటి ఏకైక విద్యా సంస్థలు మన సెయింట్ ఆన్స్ విద్యాసంస్థలని చైర్మన్, వ్యవస్థాపకులు అద్దంకి విజయ కుమార్ వెల్లడించారు. వచ్చే నెల ఆదివారం ఫ్రిబవరి 2వ తేదీ విశిష్టమైన రోజు వసంతి పంచమి కావడంతో విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు ఐసీఎస్ఈ కరికలమ్, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు జేఏఈఈ మెయిన్స్, అడ్వాన్స్, కెరియర్‌కు సంబంధించిన విషయాలపై, పాఠశాల, కళాశాలల సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు తప్పక హాజరు కావాలని, ఈ స్వర్ణావకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

దంత సంరక్షణపై శ్రద్ధ అవసరం



డాక్టర్ జి.శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏదైనా ఆహారం తిన్నవెంటనే తప్పని సరిగా పళ్లు పుక్కిళించాలని శ్రీశ్రీ డెంటల్ స్పెషాలిటీస్ డాక్టర్లు జి.శ్రీనివాస్, శ్రీ విద్యలు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాలలో వైద్య సేవలు అందజేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగస్తులకు, విశ్రాంత ఉద్యోగులకు, ఆర్టీసీ ఉద్యోగులకు, జర్నలిస్టులకు నగదు రహిత వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. అదే విధంగా వీరి సేవలను విస్తరిస్తున్నారు. ఆర్టీసీ కాప్లెంక్స్‌లో ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ స్క్వేర్ మాల్‌లో విజేత సూపర్ మార్కెట్, స్వీట్ మెలోడి స్వీట్స్ అండ్ బెకరీ ఇప్పటికే ప్రారంభం కాగా త్వరలో శ్రీ శ్రీ సినిమాస్ త్రీ స్క్రీన్ మల్టీప్లక్స్, ఫైన్ డైన్ రెస్టారెంట్, అనిక్ బ్యూటీ సెలూన్ త్వరలో ప్రారంభం కానున్నాయి.

క్లుప్తంగా

భవిత కేంద్రంలో సంక్రాంతి సందడి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల కేంద్రంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సందడి నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో ఆకుల సతీష్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలతో వివిధ క్రీడలు పరుగు పందెం, క్యారం బోర్డు, మ్యూజికల్ చైర్స్, షార్ట్ పుట్, స్కిప్పింగ్ నిర్వహించారు. గాలిపటాలు పిల్లల చేత ఎగురు వేయించారు. స్నాక్స్ అందజేశారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, హెచ్‌ఎం బి.జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తణుకులో ఏపీ ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తణుకు యూనిట్ 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. తణుకు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీ నరసరాజు, కేశిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెనుమరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీఎస్‌ఎస్ మూర్తి, తణుకు శాఖ సహాధ్యక్షులు జిన్నూరు శ్రీనివాస్, కోశాధికారి వైవీఎస్‌బీ రాయుడు, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడిపుంజులు చోరీపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపుంజులు చోరీపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎస్. ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కాసగాని సత్యనారాయణ స్థానికంగా తన పొలంలో రేకుల షెడ్డు వేసుకుని గేదెలు, కోడిపుంజులను మేపుతున్నారు. గత నెల 18వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు కోడిపుంజులను చోరీ చేశారు. దీనిపై బుధవారం సత్యనారాయణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై జేవీఎస్. ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బీవీఆర్ కళా కేంద్రంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి సంబరాలలో భాగంగా స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రధానాలు ఉంటాయని బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు వెల్లడించారు. పాల్గొనే వారు ఫోన్ నెంబర్‌లు 88978 18333, 72077 78218, 94403 31066లను సంప్రదించాలని కోరారు.

13 మంది బైండోవర్

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూదాలకు పాల్పడకుండా 13 మందిని బైండోవర్ చేశామని పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ తెలిపారు. బుధవారం వీరిని తహసీల్దారు జి.అనితకుమారి ముందు హాజరుపరిచామని పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జోరుగా.. హుషారుగా..

- దాళ్వాసాగులో రైతుల బిజీ
- గ్రామాల్లో వరినాట్ల హడావుడి
- అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు



అత్తిలి మండలం గుమ్మంపాడులో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



అత్తిలిలో ఏపుగా పెరిగిన నారుమడి

అత్తిలి: జిల్లాలోని రైతులు దాళ్వా వరిసాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తికావడంతో దాళ్వా పనులతో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు జోరుగు సాగుతున్నాయి. చీడపీడలను అధిగమించి, అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవడంతో పాటు నారుమళ్లు వేయడం, పెరిగిన నారుతో నాట్లు పనులు ఊపందుకున్నాయి. తణుకు నియోజకవర్గంలో దాళ్వాసాగు పనులు ఊపందుకున్నాయి. పంట మురగదమ్ము, వరినాట్ల వేసే పనులలో రైతాంగం నిమగ్నమైంది. అత్తిలి మండలంలో 14వేల ఎకరాలు, ఇరగవరంలో 12వేలు, తణుకు మండలంలో 11,200 ఎకరాలలో దాళ్వాసాగు చేపట్టారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 95 శాతం నారుముడులు పూర్తికాగా, 30 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. వరిసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ తెలిపారు. స్థానిక కూలీలతో పాటు బెంగాలీ కూలీలు వరినాట్లు వేస్తున్నారు.

ఆరోగ్యవంతమైన నారును ఇలా పెంచాలి

ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు దుక్కిలో వేయాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10రోజులకు కార్బోఫ్యూరాన్3జీ గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పునవేయాలి.

నాట్లు వేయడానికి పొలాన్ని సిద్ధం చేయడం

నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని మురగదమ్ము చేయాలి. పవర్ టిల్లర్ల ద్వారా పంట దమ్మును చేయడం మంచిది. దీనివల్ల చేలల్లో గోతులు ఏర్పడవు. మురగదమ్ములోనే కాంప్లెక్స్ ఎరువలను వేయాలి. పొలమంతా సమానంగా దమ్ముచెక్కతో చదునుచేయాలి. తల్లిపురుగులు గుడ్లను కొనలపై పెడుతుంది కావున నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు. దీనివల్ల కాండం తొలుచుపురుగు ఉధృతి కొంతవరకుతగ్గుతుంది. నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి.

నీటి యాజమాన్యం

నాట్లు వేసేటప్పుడు నీరుపలుచగా ఉండాలి, ఎండలు ఎక్కువగాఉంటే ఊడ్చిన వెంటనే 5 సెం.మీ వరకు నీరు నిలగట్టాలి. మూన తిరిగినరోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తి అయ్యే వరకు పొలంలో పలుచగా నీరు ఉండాలి. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5సెం.మీ లోతు వరకు నీరు ఉంచాలి.

ఎరువుల యాజమాన్యం

భూసారాన్ని బట్టి రసాయనిక ఎరువుల మోతాదు నిర్ణయించి నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు నిచ్చే ఎరువులను సమతుల్యంగా వాడాలి. నత్రజనిని కాంప్లెక్సు ఎరువుల రూపంలో గానీ, యూరియా రూపంలోగానీ వాడవచ్చు. నత్రజనిని మూడు సమాన భాగాలుగా చేసి, నాటడానికి ముందు దమ్ములోను, దుబ్బచేసే దశలోను, అంకురం దశలోను బురద పదునులోమాత్రమే సమానంగా వెదజల్లి 36–48గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి లేక 250కిలోల తేమకలిగిన మట్టిగాని కలిపి 2 రోజులు నిల్వఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.

కాంప్లెక్స్ ఎరువులను దమ్ములోనే వేయాలి



దాళ్వాసాగులో కాంప్లెక్స్ ఎరువులు దుమ్ములోనే వేయాలి. రైతులు వరి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులను వాడాలి. దాళ్వానాట్ల ప్రక్రియ వేగవంతమైంది. – టీకే రాజేష్, మండల వ్యవసాయశాఖ అధికారి, అత్తిలి

గోవింద స్వాముల పాదయాత్ర



పాదయాత్రలో గోవిందస్వాములు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక డీఎస్ చెరువు గోవింద దీక్ష పీఠం గోవింద స్వాములు బుధవారం ద్వారకా తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. గురుస్వామి గొర్ల దుర్గారావు ఆధ్వర్యంలో తొలుత పీఠం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఇరుముడులు ధరించిన స్వాములు ద్వారకా తిరుమలకు ముక్కోటి ఏకాదశి దర్శనానికి తరలి వెళ్లారు. ఉదయం పట్టణంలోని అన్ని ఆలయాలను దర్శించారు. శివరాజు, రాంబాబు, లక్ష్మీనాయుడు, శివనారాయణ, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, పావని, బాలాజీ, వినయ, దత్తు రెడ్డి, అనుశ్రీలు పాదయాత్రలో ఉన్నారు.

పీఎంఎఫ్‌బీవై బీమా గడువు పెంపు

తణుకు అర్బన్: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు తణుకు మండల వ్యవసాయాధికారి కుసుమ తెలిపారు. రైతాంగం ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటలను బీమా చేయించుకోవాలని కోరారు.

నాట్లు నాటిన ముద్దాపురం విద్యార్థులు



ముద్దాపురం పొలంలో వరినాట్లు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: మండలంలోని ముద్దాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు పొలంబాట పట్టారు. బుధవారం ప్రధానోపాధ్యాయులు ఆర్.బి.బి.సుబ్రహ్మణ్యం సూచనల ప్రకారం జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బి.యం.గోపాల రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు యస్‌వి స్వామి ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులు పాఠశాలకు దగ్గరలోని వరి పంట పొలానికి క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు రైతు తలారి సత్యనారాయణ, గుల్లపల్లి అక్కిరాజుల పర్యవేక్షణలో కొద్దిసేపు వరి నాట్లు వేశారు. ఆకుమడి, నాట్లు, ఎరువులు, పురుగు మందులు, కలుపులు, నీటిపారుదల, కోతలు, పెట్టుబడి, దిగుబడి, కష్టనష్టాల గురించి రైతాంగాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బియం గోపాల రెడ్డి మాట్లాడుతూ 8వ తరగతిలో పంట ఉత్పత్తులు అనే పాఠ్యాంశానికి సంబంధించి ప్రత్యక్ష బోధనకు ఈ క్షేత్ర పర్యటనకు విద్యార్థులను తీసుకువచ్చామని, ఆరుగాలం శ్రమించి అన్నం పెడుతున్న రైతుల కష్టాన్ని విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశ్యమే ఈ క్షేత్రస్థాయి పరిశీలన అని స్పష్టం చేశారు.

ఘనంగా వివేకానంద జయంతి



తణుకులో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఏబీవీపీ కన్వీనర్ పవన్‌కుమార్

తణుకు అర్బన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తణుకు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ బాగ్ కన్వీనర్ చిట్టూరి పవన్ కుమార్ మాట్లాడుతూ లేవండి మేల్కొలపండి.. లక్ష్యం చేరే వరకు ఆగకండి.. అనే గొంతెత్తి సమాజాన్ని చైతన్యపరిచిన వ్యక్తి స్వామి వివేకానంద అని ఆయన సేవలను కొనియాడారు. యువతను తట్టిలేపే ప్రసంగాలు చేస్తూ సేవాభావాన్ని రగిలించిన స్వామి వివేకానంద జీవన విధానం ఆదర్శనీయమని అన్నారు. అనంతరరం విద్యార్థులు రూపొందించిన వివేకానంద 12 అడుగుల చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, న్యాయవాది కామర్సు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



విశేష అలంకరణలో కృష్ణ పరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ధనుర్మాసం 24వ రోజు పురస్కరించుకొని బుధవారం శ్రీ కృష్ణ పరమాత్మ (రంగనాధస్వామివారికి) మహిళలచే ముత్యాల హారతిని సమర్పించారు. ముందుగా మేళతాళాలతో కాలువకు వెళ్లి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామి వారికి, సాలిగ్రామాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అష్టోత్తర పూజలు జరిగాయి. మందిర అధ్యక్ష, కార్యదర్శులు కొర్లేపర పాండురంగారావు, ఇందుకూరి మోహన్‌రాజులు మాట్లాడుతూ గోదాదేవి స్వామి వారికి ముత్యాల హారతి ఇచ్చిన విధంగానే ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మహిళలు గోపిక వేషధారణాలతో హారుతులు నిర్వహించినట్లు వెల్లడించారు. భక్తులు పాల్గొన్నారు.

14న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో ఈనెల 14న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని క్యాలండర్ ఆఫ్ ఈవెంట్ జిల్లా చైర్ పర్సన్ యాతం రాంబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించే ఈముగ్గుల పోటీలలో పాల్గొనే వారు ఈనెల 14వ తేదీ మధ్యాహ్నంలో తమ పేర్లను బ్యాంకువీధిలో గల యాతం రాంబాబు స్టీలు షాపులో నమోదు చేయించుకోవాలని కోరారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈఅవకాశాన్ని మహిళలు, బాలికలు ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్ లో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు పరిధిలోని అన్ని ఏరియాలకు విద్యుత్ లైన్లు రిపేర్లు నిమిత్తం ఈ నెల 9వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు.

మునిసిపాలిటీ వార్షిక బడ్జెట్ రూ. 113.07 కోట్లు

తణుకు అర్బన్: 2025–26 సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను రూపొందించినట్లు తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో సాధారణ నిధులు, వివిధ గ్రాంట్స్ రూపంలో ఈ ఏడాది రూ.1,13,07,62,200 కోట్లు మొత్తాన్ని డిప్యూటీ కలెక్టరు, స్పెషల్ ఆఫీసర్ బి.శివన్నారాయణరెడ్డిచే ఆమోదం పొందినట్లు చెప్పారు. సదరు బడ్జెట్‌లో సాధారణ నిధులు, సామాజిక పింఛన్లు, ఏఐఐబీ నీటి సరఫరా ప్రాజెక్టు, 15వ ఆర్థికసంఘ నిధులకు సంబంధించి ఆదాయ ఖర్చులను పొందుపరిచినట్లు వివరించారు.

ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి





ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామి, ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

అత్తిలి: ఈనెల 10న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బులితిరుపతిగా పేరుగాంచిన అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వ హిస్తున్నట్లు ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు. శుక్రవారం వేకువజామున స్వామివారికి సుప్రభాతసేద, తోమాలసేవ జరుగుతుందని చెప్పారు. ఉదయం భక్తుల దర్శనార్థం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అద్దాల మండపంలో ఉంచడం జరుగుతుందన్నారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసామని తెలిపారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 12వ తేదీన స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించి అనంతరం తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న గోదా కల్యాణం జరుగుతుందన్నారు. వివాహం కానీ స్త్రీ, పురుషులు గోదాదేవి కల్యాణంలో పాల్గొని కల్యాణ అక్షితలు, ప్రసాదాన్ని స్వీకరించడం ద్వారా వారి కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు. భక్తులు ఈకార్యక్రమాలలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తరించాలని అర్చకులు శేఖరాచార్యులు కోరారు.

గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి



గురుకుల పాఠశాలను సందర్శించిన ఏఐఎస్‌ఏ సంఘ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఏరియాలో ఉన్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు మంజూరు చేయాలని వీటితో పాటు ఈ పాఠశాలల్లో రెగ్యూలర్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిగూడెం ఏరియాలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (ఎస్సీ) గురుకుల పాఠశాలలను ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి సందర్శించారు. పిల్లలతో సహపంక్తి భోజనం చేశారు. రెండు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని, లేని పక్షంలో ఉద్యమాలు రూపొందిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.పవన్, వి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో హోరెత్తిన సంక్రాంతి సందడి



తణుకు ఎస్‌కేఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగి మంట వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



తణుకు ఎస్‌కేఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగవల్లులు వేస్తున్న దృశ్యం



తణుకు ఎస్‌కేఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంగిరెద్దు విన్యాసాలు



తణుకులో ద్విచక్ర వాహనంపై హరిదాసు

తణుకులో సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సంక్రాంతి పండుగ దగ్గరపడడంతో మహిళలు తమ ఇళ్ల ముందు ముత్యాల ముగ్గులను తీర్చిదిద్దుతున్నారు. పలుకే బంగారామాయేనే అంటూ హరిదాసు కీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు ఇంటి గుమ్మంలో ఉదయాన్నే సందడి చేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికే సంక్రాంతి సబంరాలు మిన్నంటాయి. ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలతో అలరిస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో గత వారం రోజులుగా సంక్రాంతి శోభ కనిపిస్తోంది. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి హుషారుగా కేరింతలు కొడుతున్నారు. - తణుకు అర్బన్